www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 2 సంచిక -248 శుక్రవారం 22 నవంబర్ 2024 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -6 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts



2లో.

## హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

బేగంపేట విమానాశ్రయంలో స్వాగతం పలికిన గవర్నర్, సీఎం, కేంద్రమంత్రులు

నేరుగా రాజ్ భవన్ చేరుకున్న ద్రౌపది ముర్ము

లోక్ మంథన్-2024లో పాల్గొననున్న ద్రౌపది ముర్ము

# మూసీ పునరుజ్జీవం నుంచి వెనక్కి తగ్గం

- ఎన్ని శక్తులు అడ్డుపడినా పూర్తి చేస్తాం
- హైదరాబాద్‌ను ప్రపంచస్థాయికి తీసుకు వెళతాం
- ఎక్స్ వేదికగా స్పష్టం చేసిన సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి: మూసీ నదిని ప్రక్షాళన చేసి హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తుందని, ఎన్ని శక్తులు అడ్డుపడినా పక్రియ పూర్తి చేసే బాధ్యతను కాంగ్రెస్ ప్రభత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.'నదుల వెంట నాగరికత వర్థిల్లాలి..నదులను కబళిస్తే.. మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రజా ఆరోగ్యం పటిష్ఠ ఆర్థికం పర్యావరణ కోణాల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్‌కు మూసీ ఒక వరం కావాలి. కానీ, శాపంగా మిగిలిపోకూడదు.

మిగతాది 2లో...



# అదానీ గ్రూప్ పై లంచం ఆరోపణలు

## అమెరికాలో కేసు నమోదు

## భారత్ లో తీవ్ర రాజకీయ దుమారం

### ఆరోపణలు నిరాధారమన్న అదానీ గ్రూప్

న్యూయార్క్,నవంబర్ 21,ప్రజావినికిడి: ఆదానీ గ్రూపు మరో వివాదంలో ఇరుక్కుంది. అదికూడా లంచం కేసు కావడం విశేషం. భారత బిలియనీర్, అదానీ గ్రూప్ సంస్థ ఛైర్మన్ గౌతమ్ అదానీపై లంచం కేసు నమోద య్యింది. ఈ మేరకు అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. ఈ కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడమే గాక.. దాని గురించి ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి వారి నుంచి నిధుల సేకరణకు పాల్పడినట్లు న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. దీంతో గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్ అదానీ సహా మరో ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మిగతాది 2లో...



# 25న బిఆర్ఎస్ గిరిజన రైతు ధర్నా అనుమతించిన రాష్ట్ర హైకోర్టు

వెయ్యి మంది రైతులతో ధర్నాకు అనుమతించిన హైకోర్టు

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన, రైతు ధర్నా చేపట్టాలని బీఆర్ఎస్ నిర్ణయం

2లో.

# అదానీతో అనుబంధం దేశానికే అవమానం



- అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు
- ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడు
- అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం
- తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులు
- అందులో మీ భడే భాయ్,అదానీ భాయ్ వాటాఎంత ?
- మీ హైకమాండ్ వాటా ఎంత?.. రేవంత్ రెడ్డి
- సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు

2లో.



# లగచర్ల ఘటనను సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల కమిషన్...

సీఎస్, డీజీపీకి నోటీసులు

2 వారాల్లో పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని ఆదేశాలు

లగచర్లకు అధికారుల బృందాన్ని పంపించనున్నట్లు వెల్లడి

ఈ నెల 18న బాధితుల ఫిర్యాదు

2లో.

# డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు

### పలు బిల్లుల ఆమోదం కోసం ప్రభుత్వం కసరత్తు

హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:: తెలంగాణ అసెంబ్లీ సమావేశాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు ప్రారంభం కానున్నాయని ప్రభుత్వం వెల్లడించింది సమావేశాల్లో పలు కీలక చట్టాల ఆమోదానికి రేవంత్ సర్కారు సన్నద్ధం చేస్తోంది. ఆర్ఓఆర్ చట్టాన్ని ఆమోదించాలని చూస్తోంది. రైతు, కులగణన సర్వేపై కూడా సమావేశాల్లో చర్చించే అవకాశం కనిపిస్తోంది.

మిగతాది 2లో...



# రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

### గుంట భూమిని కబ్జా చేసినట్లు రుజువు చేయగలవా

### కబ్జాల చరిత్ర మీదే అంటూ హరీష్ రావు ఘాటు విమర్శలు

సంగారెడ్డినవంబర్ 21,ప్రజావినికిడి: బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు సీఎం రేవంత్ రెడ్డితెరలేపుతున్నాడని సీఎం రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. భూ కబ్జాలకు పాల్పడుతున్నాడని సీఎం చేసిన తప్పుడు ఆరోపణలపై ఘాటుగా స్పందించారు.గురువారం అందోల్ మండలం మాసాన్‌పల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగనాయక సాగర్ దగ్గర ఇరిగేషన్ భూములను కబ్జా చేశానని నాపై రేవంత్ రెడ్డి తప్పుడు ఆరోపణ



చేశాడు.పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుంది అన్నట్లు కబ్జాలు చేసే చరిత్ర నీదని ధ్వజమెత్తారు. రైతుల పట్టా భూములను ధరణి ద్వారా13 ఎకరాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు. ఒక గుంట కానీ, ఒక ఎకరా కానీ ఇరిగేషన్ భూమి కానీ, ప్రభుత్వ భూమి కానీ తీసుకున్నట్టు నా చరిత్రలో లేదని స్పష్టం చేశారు. ఏ భూమిని అయితే నేను రిజిస్ట్రేషన్ చేసుకున్నానో ఆ భూమిలోనే ఉన్నాను. మిగతాది 2లో...

# కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

### గత ప్రభుత్వానిది ఎప్పుడూ గడీల పాలన

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి: ప్రజా ప్రభుత్వం ప్రజలతో మమేకం అవుతూ ప్రజల సమస్యలు తెలుసుంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అందుకోసమే ముఖాముఖీ కార్యక్రమం కి వచ్చామని తెలిపారు. ప్రలజావాణితో పాటు.. పార్టీ భావజాలం నమ్మి.. ఓటేసిన ప్రజల అభిప్రాయాలను, ఇబ్బందులను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం తీసుకువచ్చామని చెప్పారు. గత ప్రభుత్వం ఎప్పుడూ గడీల మధ్య ఉండి పాలన చేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రజా పాలన చేస్తుందని అన్నారు. విద్య, వైద్యం మీద ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తోందని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ చార్జీలు 40 శాతం పెంచి అందిస్తున్నామని వెల్లడించారు. అనేక పథకాలతో ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం రాగానే ప్రక్షాళన చేసి 50వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. పదేళ్లలో



గ్రూప్ 1 పరీక్షలు సరిగ్గా నిర్వహించాలేక గాలికి వదిలేశారని విమర్శించారు. కుటిల ప్రయత్నాలను తట్టుకొని ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ.. ఆ వడ్డీని ప్రభుత్వం కట్టనుందని చెప్పారు. మహిళా సంఘాలతో వెయ్యి మెగా ఓల్ట్ ల విద్యుత్ ఉత్పత్తికి ఒప్పందం చేసుకున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేసే ప్రయత్నం ప్రభుత్వం చేస్తుందని స్పష్టం చేశారు. 60 లను అడ్వాన్స్డ్ టెక్నాలజీ తో ముందుకు వెళ్లేలా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని చెప్పారు.

# అదానీ గ్రూప్ పై లంచం ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

అదానీ, దాని అనుబంధ సంస్థలు 20 ఏళ్లలో 2 బిలియన్ డాలర్ల లాభం పొందగల సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు సుమారు 265 మిలియన్ డాలర్లు లంచాలు ఆఫర్ చేసినట్లు ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అనంతరం అమెరికా, అంతర్జాతీయ మదుపర్లకు తప్పుడు సమాచారం తెలియజేసి నిధులు సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించినట్లు పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా.. ఆ కంపెనీ రుణ దాతలు, పెట్టుబడిదారుల నుంచి 3 బిలియన్ డాలర్లకు పైగా రుణాలు, బాండ్లను సేకరించిందని ఆరోపిస్తూ న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు అభియోగాలు మోపారు. ఇదే సమయంలో సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకు పైగా సమీకరించిందని అందులో ఆరోపించింది. దీనిపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది. అయితే తమపై వచ్చిన ఆరోపణలపై అదానీ గ్రూప్ స్పందించింది. సోలార్ పవర్ కాంట్రాక్టులు దక్కించుకోవడానికి లంచం ఇవ్వజూపారంటూ వచ్చిన అభియోగాలను తోసిపుచ్చింది. అదానీ గ్రూపుపై అమెరికా ప్రాసిక్యూటర్లు చేస్తున్న ఆరోపణలు నిరాధారమని కొట్టి పారేసింది. చట్టాలకు లోబడి తమ గ్రూపు నడుచుకుంటోందని వివరణ ఇచ్చింది. న్యాయపరంగా ముందుకెళ్లే అంశాన్ని పరిశీలిస్తున్నా మని పేర్కొంది. సోలార్ పవర్ ప్రాజెక్టులు దక్కించుకోవడంలో భాగంగా అదానీ గ్రూపు రూ.2,100 కోట్లు భారత అధికారులకు లంచం ఇవ్వజూపిందన్న ఆరోపణలతో పాటు, దాని గురించి ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చారంటూ అమెరికాలో అభియోగాలు నమోదయ్యాయి. గౌతమ్ అదానీ సహా మరో ఏడుగురిపై కేసులు నమోదైనట్లు అక్కడి అధికారులు పేర్కొన్నారు. ఈనేపథ్యంలో అదానీ గ్రూపు స్టాక్స్ భారీగా పడ్డాయి. ఈ వ్యవహారం రాజకీయంగానూ దుమారం రేపింది. దీంతో కాంగ్రెస్, భాజపాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. అదానీ గ్రూపుపై పెద్దఎత్తున ఆరోపణలు రావడంపై ఆ గ్రూపు స్పందించింది. అవి కేవలం నేరారోపణలు మాత్రమేనని అదానీ గ్రూపు ప్రతినిధి పేర్కొన్నారు. దోషులుగా రుజువయ్యే వరకు నిందితులను నిర్దోషులుగానే భావించాల్సి ఉంటుందన్నారు. పాలనా వ్యవహారాల్లో, పారదర్శకత విషయంలో అదానీ గ్రూపు ఎప్పుడూ అత్యున్నత ప్రమాణాలు పాటిస్తుందన్నారు. తాము కార్యకలాపాలు నిర్వహించే ప్రతిచోటా వీటిని పాటిస్తూ వస్తున్నామన్నారు. చట్టాలను గౌరవిస్తూ, వాటికి లోబడి నడుచుకుంటున్నందున వాటాదారులు, భాగస్వాములు, ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అదానీ గ్రూపు ఓ ప్రకటనలో పేర్కొంది.

# అదానీతో అనుబంధం దేశానికే అవమానం

హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
అదానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీపై యూఎస్ అభియోగాలు నమోదయ్యాయి. కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడంతోపాటు ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధుల సమీకరణకు పాల్పడినట్లుగా న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.దానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీపై యూఎస్ అభియోగాలు నమోదయ్యాయి. కంపెనీ అధికారులకు లంచాలు ఇవ్వజూపడంతోపాటు ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధుల సమీకరణకు పాల్పడినట్లుగా న్యూయార్క్ ఫెడరల్ ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆసక్తికర ట్వీట్ చేశారు. అగ్రరాజ్యం అమెరికానే మోసం చేయాలని చూసిన ఘనుడు.. భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇవ్వజూపిన మోసగాడని విమర్శించారు. అదానీతో కాంగ్రెస్, బీజేపీ అనుబంధం దేశానికి అవమానం, అరిష్టమన్నారు. రామన్నపేటలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ఎంత ఇవ్వజూపిండో, మూసీలో అదానీ వాటా ఎంతో అంటూ ప్రశ్నించారు. ఇలాంటి మోసగాడికి.. దగాకోరుకా.. తెలంగాణలో పెట్టుబడుల అనుమతులు ఎలా ఇచ్చారంటూ మండిపడ్డారు. తక్షణం అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను రద్దు చేయాలని.. అదానీతో చేసుకున్న చీకటి ఒప్పందాలు అన్నీ బయట పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఆస్తులను కొల్లగొట్టే మీ కుయుక్తులలో మీ భడే భాయ్ వాటాఎంత ? మీ అదానీ భాయ్ వాటా ఎంత? మీ హైకమాండ్ వాటా ఎంత? అంటూ కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా నిలదీశారు.గౌతమ్ అదానీ, ఆయన బంధువు సాగర్‌తో పాటు మరో ఏడుగురిపై అభియోగాలు నమోదయ్యాయి. అదానీ, అనుబంధ సంస్థలు 20 సంవత్సరాల్లో రెండు బిలియన్ డాలర్ల లాభం పొం సోలార్ పవర్ ప్లాంట్ ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు 265 మిలియన్ డాలర్ల లంచాలు ఇవ్వ జూపినట్లుగా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. అమెరికాతో పాటు ఇంటర్‌నేషనల్ ఇన్వెస్టర్లకు తప్పుడు సమాచారం ఇచ్చి నిధులను సమీకరించేందుకు కంపెనీ ప్రయత్నించారని అభియోగాలు మోపారు.అదానీ గ్రీన్ ఎనర్జీలో అక్రమ మార్గాల ద్వారా కంపెనీ మూడు బిలియన్ డాలర్లకుపైగా రుణాలు, బాండ్లను సేకరించినట్లుగా న్యూయార్క్ ప్రాసిక్యూటర్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ మరో సివిల్ కేసు నమోదు చేసింది. యూఎస్ సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించి అదానీ గ్రీన్ ఎనర్జీ అమెరికా ఇన్వెస్టర్ల నుంచి 175 మిలియన్ డాలర్లకుపైగా సేకరించినట్లుగా ఆరోపించింది. ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి జరిమానాతో పాటు కంపెనీపై ఆంక్షలు విధించాలని రెగ్యులేటర్ కోరింది. సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శనాస్త్రాలు సంధించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన ఆహారం అందించలేని రేవంత్.. మహిళలను కోటీశ్వరులను చేస్తాడట అంటూ మండిపడ్డారు. రోజుకో గురుకుల పాఠశాలలో ఆహారం వికటించి విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నడూ లేనిది గురుకుల పాఠశాల్లో ఇప్పటి వరకు 40 మందికి పైగా విద్యార్థులు మరణించారని చెప్పారు. పిల్లలు పిట్టల్లా రాలుతుంటే దిద్దుబాటు చర్యలు తీసుకోకుండా వేదికల మీదికెక్కి పిట్టలదొర మాటలు చెబుతున్నాడని విమర్శించారు. తల్లికి బువ్వ పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయించాడట అని ఎద్దేవా చేశారు. దవాఖానల్లో విద్యార్థులు, చెరసాలలో రైతన్నలు, ఆందోళనలో నిరుద్యోగులు.. జాగో తెలంగాణ అంటూ కేటీఆర్ ట్వీట్ చేశారు.
.........

# మూసీ పునరుజ్జీవం నుంచి వెనక్కి తగ్గం

(మొదటి పేజీ తరువాయి)

మూసీ ప్రక్షాళన చేయాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పం. ఈ తరానికే కాదు.. తరతరాలకు మేలు చేసే నిర్ణయం. ఈ నిర్ణయానికి అండగా నిలవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎక్స్‌లో సీఎం రేవంత్ ఓ పోస్ట్ చేశారు. కాగా.. మూసీ పరీవాహక ప్రాంతం మురికి కూపంగా మారి.. హైదరాబాదీలకు విష వాయువులు అందిస్తుందని, దుర్భరంగా మారిన వారి జీవన విధానం మార్చేందుకు మూసీని ప్రక్షాళన చేసి, పునరుద్ధరించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మూసీ వెంట నరకం అనుభవిస్తోన్న పేదవారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో యాదవులకు అత్యధికంగా సీట్లు ఇస్తామని, కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, ఎంపీ, ప్రజాప్రతినిధులుగా అవకాశాలు పెంచి నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టును అడ్డుకోవాలని చూసేవారు కుక్కచావు చస్తారని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. బుల్డోజర్లు ఎక్కించి అయినా ప్రాజెక్టును చేపట్టి తీరతామని ప్రకటించారు. మూసీ కాలుష్యం వల్ల ఆ నది పరీవాహక ప్రాంత ప్రజలు అణుబాంబుతో కలిగే ప్రమాదం కంటే ఎక్కువ దుష్పరిణామాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వరంగా ఉండాల్సిన మూసీ.. శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ పునరుజ్జీవంతోనే వారికి ఆ సమస్య నుంచి విముక్తి కలుగుతుందని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గంగా, సబర్మతి నదులను రూ.40 వేల కోట్లతో సుందరీకరణ చేసుకుంటే, తాను తెలంగాణ ముఖ్యమంత్రిగా మూసీ పునరుజ్జీవం చేయొద్దా? అని ప్రశ్నించారు. ప్రధాని చేసిన పనిని మెచ్చుకుంటూ.. మూసీ ప్రక్షాళనపై నకిలీ బీజేపీ నేతలు అవాకులు చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. కమిషన్ల కోసమే మూసీ ప్రాజెక్టు చేపట్టానని బీఆర్ఎస్ అంటోందని, ఈ మూసీ ప్రక్షాళన చేయకపోతే తన జన్మ దండగ అని భావోద్వేగానికి లోనయ్యారు. 'రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన చేపట్టి.. రూ.25 వేల కోట్లు దోచుకునే ప్రయత్నం చేస్తున్నామంటున్నారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



హైదరాబాదనవంబర్ 21,ప్రజావినికిడి:
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ చేరుకున్నారు. వివిధ అధికారిక కార్యక్రమాలలో హాజరయ్యేందుకు ఆమె నగరానికి వచ్చారు. హైదరాబాద్‌లో జరుగుతున్న కోటి దీపోత్సవానికి కూడా ఆమె హాజరుకానున్నారు.
ఈ రోజు సాయంత్రం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క తదితరులు ఘనస్వాగతం పలికారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కూడా ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు.బేగంపేట విమానాశ్రయం నుంచి ఆమె నేరుగా రాజ్ భవన్ చేరుకున్నారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకొని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవానికి వెళ్లనున్నారు. రేపు శిల్పకళా వేదికలో జరుగుతోన్న లోక్ మంథన్-2024 కార్యక్రమంలో పాల్గొంటారు. ఆ తర్వాత ఆమె ఢిల్లీకి వెళ్లనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో నగరంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు

## రేవంత్ రెడ్డివి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)

నువ్వు ఎప్పుడు వస్తావో చెప్పు రేవంత్ రెడ్డి.. నీ సమక్షంలోనే సర్వే చేద్దాం. నువ్వు ఎన్ని బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేసినా భయపడేది లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున రైతుల పక్షాన నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో రేవంత్ రెడ్డి రైతులకు తొమ్మిది హామీలను అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఏ ఒక్క హామీనైనా నెరవేర్చగలిగాడా అని ప్రశ్నించారు. ఏకకాలంలో రైతు రుణమాఫీ చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోళ్లలో సైతం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో, పెట్టుబడి సాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందన్నారు. రాష్ట్రంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తామని సివిల్ సప్లై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. మరోపక్క సివిల్ సప్లై కమిషనర్ 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొంటామని ప్రకటించారు. దీని ఆంతర్యమేమిటని నిలదీశారు. మధ్యలో 20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఎక్కడికి పోయిందో చెప్పాలన్నారు. రైతులు పండించిన ధాన్యంలో సగం దళారుల పాలయింది. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు..దళిత, గిరిజన, అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఆ భూములను రాష్ట్ర ప్రభుత్వం కొల్లగొడుతున్నది. కంపెనీ నిర్మాణాల కోసం ఆ భూములను తన ఆప్తులకు కట్టబెట్టే ప్రయత్నం సీఎం చేస్తున్నాడు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న కేటీఆర్ పై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు.



## డిసెంబర్ 9వ తేదీ నుంచి శాసనసభ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ సమావేశాలతో పాటు మంత్రివర్గ విస్తరణ మీద కూడా ప్రభుత్వం ఫోకస్ పెట్టిందని తెలుస్తోంది.డిసెంబర్ 7వ తేదీతో రేవంత్ సర్కార్ ఏడాది కాలం పూర్తి చేసుకోనుంది. దీంతో మంత్రివర్గ విస్తరణ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలిసింది. అయితే మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని వినిపిస్తోంది. కానీ ఆలోపే మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు జరుగుతోందని కూడా సమాచారం అందుతోంది. మరోవైపు పంచాయతీ ఎన్నికలపై కూడా ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలుస్తోంది. త్వరలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఆసరా పెన్షన్, రైతు భరోసా పథకం కింద ఇచ్చే మొత్తాన్ని పెంచేందుకు రేవంత్ సర్కారు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఎలక్షన్స్‌కు ముందు పెన్షన్, రైతు భరోసాను పెంచితే ప్రభుత్వానికి మంచి పేరుతో పాటు పార్టీకి మైలేజీ వస్తుందని భావిస్తున్నారట. అసెంబ్లీ సమావేశాలు, పంచాయతీ ఎన్నికల మీద ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్.. అందుకు అనుగుణంగా కులగణను చేపట్టారు. మరోవైపు కొండపోచమ్మ సాగర్ దగ్గరలోని మాజీ మంత్రి హరీష్ రావు ఫామ్‌హౌస్‌పై విచారణ జరిపించాలని నిర్ణయించారు. గత పదేళ్లలో కెసిఆర్ ప్రభుత్వం చేసిన అవినీతికి సంబంధించి అసెంబ్లీలో వాడీవేడీ చర్చకు ప్రభుత్వం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది.

## 25న బిఆర్ఎస్ గిరిజన రైతు ధర్నా
### అనుమతించిన రాష్ట్ర హైకోర్టు

హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
మానుకోటలో నిర్వహించ తలపెట్టిన బీఆర్ఎస్ గిరిజన రైతు ధర్నాకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నెల 25వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ధర్నా చేసుకునేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. వెయ్యి మంది రైతులతో ధర్నాకు అనుమతి లభించింది. అయితే మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గిరిజన రైతు ధర్నా వాస్తవానికి గురువారం చేపట్టాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. కానీ పోలీసులు అనుమతించలేదు. దీంతో గిరిజన రైతు ధర్నాకు అనుమతి ఇవ్వాలని బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ధర్నాకు అనుమతి ఇవ్వకపోగా.. మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో అన్ని వీధుల్లో జిల్లా ఎస్పీ సుదీర్ రామనాథ్ కేకన్ ఆధ్వర్యంలో పోలీసుల బలగాలు కవాతు నిర్వహించాయి. ప్రజా పాలనలో కనీసం ధర్నా చేయడానికి కూడా అనుమతించని ప్రభుత్వ తీరుపై బిఆర్ఎస్ భగ్గుమన్నది. ఇలాంటి ధోరణులు ప్రజాస్వామ్యానికి మంచివి కాదని ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో ధర్నా కోసం హైకోర్టును బిఆర్ఎస్ ఆశ్రయించింది.

## లగచర్ల ఘటనను సుమోటోగా స్వీకరించిన మానవ హక్కుల కమిషన్... సీఎస్, డీజీపీకి నోటీసులు

హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సుమోటోగా స్వీకరించింది. తెలంగాణ రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లో పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అలాగే తమ అధికారుల బృందాన్ని లగచర్లకు పంపించాలని కూడా నిర్ణయించింది.ఫార్మా కంపెనీ భూనిర్వాసితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 18న ఢిల్లీలో మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. వారి అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న మానవ హక్కుల కమిషన్ ఈ నోటీసులు జారీ చేసింది.వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా కంపెనీకి భూమి ఇవ్వడానికి నిరాకరిస్తూ రైతులు ఆందోళన చేస్తున్నారని, బాధితుల్లో ఎక్కువ మంది ఎస్సీ, ఎస్టీ వర్గాల నుంచి ఉన్నారని జాతీయ మానవ హక్కుల కమిషన్ పేర్కొంది.
ఫార్మా కంపెనీకి భూములు ఇవ్వడానికి నిరాకరిస్తున్న నేపథ్యంలో పోలీసులు తమను వేధిస్తారనే భయంతో చాలామంది గ్రామస్థులు ఊరి నుంచి బయటకు వచ్చి ఉంటున్నారని పేర్కొంది. ఈ నేపథ్యంలో, రెండు వారాల్లో పూర్తిస్థాయి నివేదిక సమర్పించాలని సీఎస్, డీజీపీకి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపింది.

## పంచాయతీ సర్పంచ్‌లకు గుడ్ న్యూస్ !
### పెండింగ్ బిల్లుల చెల్లింపుకు ప్రభుతం సుముఖం!!

హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంచాయతీ సర్పంచ్ లకు గుడ్ న్యూస్ చెప్పనున్నారు. త్వరలోనే పంచాయతీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకూ పంచాయతీలకు సంబంధించి 750 కోట్ల రూపాయల బిల్లులను ప్రభుత్వం క్లియర్ చేసింది. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం బకాయి పెట్టిన 1,200 కోట్లకు పైగా పంచాయతీ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. ఇటీవల కాలంలో బిల్లులు చెల్లించాలంటూ సర్పంచ్ లు ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. పలు చోట్ల ధర్నాలు చేసిన నేపథ్యంలో రేవంత్ సర్కార్ ఈ నిర్ణయం తీసుకుంది. పంచాయతీలకు పెండింగ్ లో ఉన్న బిల్లులను దశల వారీగా క్లియర్ చేసేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమయింది. నిధులతో జరిగిన పనులపై ఆరా తీసే పనిలో సరకార్ పడింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ లో ఉన్న బిల్లుల వివరాలను ఇవ్వాలని కోరింది. పంచాయతీల వారీగా పనులు ఎప్పుడు ప్రారంభమయ్యాయి? ఎప్పుడు పూర్తయ్యాయి? వంటి వివరాలను అందించాలని పంచాయతీరాజ్ శాఖ కలెక్టర్లను కోరింది. అయితే ఇప్పటి వరకూ తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాల్లో చేపట్టిన పనుల్లో 588 కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని ప్రాథమికంగా తేలింది. పంచాయతీ బిల్లులు చెల్లించకపోవడంతో సర్పంచ్ లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు కూడా దగ్గరపడుతుండటంతో రేవంత్ ప్రభుత్వం ఈ బిల్లులను క్లియర్ చేయాలని నిర్ణయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచ్ లకు అనుకూలంగా ఉంటుందన్న సంకేతాలను బలంగా పంపేందుకు ఈ బిల్లులను క్లియర్ చేయాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. అదే జరిగితే సర్పంచ్ లు అందరూ హ్యాపీగా ఉంటారని అభిప్రాయం వ్యక్తం అయింది. ఈ నిధుల విడుదలతో గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపయోగపడుతుందని భావిస్తుంది.

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని జుబ్లీహిల్స్ సీఎం నివాసంలో కలిశారు. రేవంత్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. శ్రీవారి ప్రసాదాన్ని అందించారు. ఇరువురు కాసేపు మాట్లాడుకున్నారు.తెలంగాణ భక్తుల దర్శనం కోసం తెలంగాణ ప్రజాప్రతినిధులు ఇచ్చే లేఖలను టీటీడీ పరిగణనలోకి తీసుకునే అంశంపై చర్చించి ఉంటారని భావిస్తున్నారు. బీఆర్ నాయుడు నిన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిశారు. తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే లేఖలను పరిగణలోకి తీసుకోవాలని కేటీఆర్ నిన్న విజ్ఞప్తి చేశారు. అలాగే తెలంగాణలోని దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
శుక్రవారం 22 నవంబర్ 2024

# ముదురుతున్న రామ్ చరణ్ దర్గా వివాదం..

## క్షమాపణకు అయ్యప్ప స్వాములు డిమాండ్



హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి: అయ్యప్ప మాలధారణ వేసిన సినీ నటుడు రామ్ చరణ్ తేజ్ దర్గాను సందర్శించడం తీవ్ర దుమారం రేపుతోంది. మాలలో ఉండీ ఉర్సు ఉత్సవాల్లో ఎలా పాల్గొంటారని ప్రశ్నిస్తున్నారు. ఈ వివాదంపై హిందూ సంఘాలు తప్పుబడుతున్నాయి. చెర్రీ సతీమణి ఉపాసన దానిపై వివరణ ఇచ్చినా కూడా రామ్ చరణ్ క్షమాపణ చెప్పాల్సిందేనని అయ్యప్పస్వామి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. మాల నియమాలకు విరుద్ధంగా వ్యవహరించిన రామ్ చరణ్ క్షమాపణ చెప్పాలని కోరుతున్నాయి.కడప నగరంలోని అమీన్‌పూర్ పెద్ద దర్గా ఉర్సు వేడుకల్లో రామ్ చరణ్ పాల్గొనడం.. అక్కడ ప్రార్థనలు చేయడం తీవ్ర దుమారానికి తెర రేపింది. అయ్యప్ప మాల వేసుకున్న స్వాములు రామ్ చరణ్ దర్గా సందర్శనను తప్పుబడుతున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం అయ్యప్ప జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) విలేకరుల సమావేశం నిర్వహించారు. జేఏసీ నాయకులు గాంధీ కృష్ణ బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. 'అయ్యప్ప మాలధారణలో ఉండి అయ్యప్ప భక్తుల మనోభావాలను దెబ్బతీసిన మెగా హీరో రామ్ చరణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలి' అని డిమాండ్ చేశారు. పవిత్రమైన అయ్యప్ప మాల ధరించి మాల నియమాలకు విరుద్ధంగా బొట్టును తొలగించడమే కాకుండా దర్గాను సందర్శించడం ధర్మానికి విరుద్ధమని స్పష్టం చేశారు. ధర్మాన్ని కాపాడతానంటూ ఓవైపు ఏపీ డిప్యూటీ సీఎం, రామ్ చరణ్ బాబాయి పవన్ కల్యాణ్ శ్రమిస్తుంటే అదే కుటుంబంలో జన్మించిన రామ్ చరణ్ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విచారకరమని పేర్కొన్నారు. రామ్‌చరణ్ బేషరత్‌గా అయ్యప్ప భక్తులకు, యావత్ హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్ధృతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

# వచ్చే నెల తొలివారంలో టీజీపీఎస్సీ గ్రూప్ 2 హాల్ టికెట్లు విడుదల


హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
తెలంగాణ గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇప్పటికే టీజీపీఎస్సీ విడుదల చేసిన సంగతి తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం డిసెంబర్ 15, 16 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 4 పేపర్లకు ఈ పరీక్షలు జరగనున్నాయి. ఆయా రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 1, 3 పరీక్షలు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పేపర్ 2, 4 పరీక్షలు నిర్వహించనున్నారు. ఇక గ్రూప్ 2 పరీక్షలకు సంబంధించిన హాల్‌టికెట్లను డిసెంబర్ 9 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని టీజీపీఎస్సీ తెలిపింది. ఈ మేరకు తాజాగా ప్రకటన జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 783 గ్రూప్ 2 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ ఉద్యోగాలకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 5.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే.మొత్తం 18 విభాగాల్లో 783 పోస్టులను టీజీపీఎస్సీ భర్తీకి గత ఏడాది గ్రూప్ 2 ఉద్యోగ ప్రకటన జారీచేసిన సంగతి తెలిసిందే. 2023 జనవరి 18 నుంచి ఫిబ్రవరి 16 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా స్వీకరించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 5,51,943 మంది అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే మూడు సార్లు వివిధ కారణాలతో గ్రూప్ 2 పరీక్ష వాయిదా పడింది. మరోవైపు గ్రూప్ 2 పోస్టుల సంఖ్య పెంచాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై ఇప్పటి వరకు స్పదించని రేవంత్ సర్కార్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకుంటుంది. గత డీఎస్సీలో కూడా ప్రభుత్వం ఇలాంటి వైఖరే అనుసరించింది. డీఎస్సీ పరీక్షలను నెల రోజుల పాటు వాయిదా వేయాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగులు నిరసనలు చేపట్టినా.. కనీసం పట్టించుకోకుండా మొండి వైఖరితో పరీక్షలు నిర్వహించింది. కనీసం గ్రూప్ 2 పోస్టుల పెంపు విషయంలో అయినా సర్కార్ కరుణిస్తుందేమోనని నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వ తీరు ఇందుకు భిన్నంగా ఉండటం గమనార్హం. ఏం జరుగుతుందో వేచి చూడాల్సిందే..

# రాష్ట్రపతి పర్యటన నేపథ్యం

## నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండురోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనున్నారు. హైదరాబాద్‌లో జరిగే పలు కార్యక్రమాలకు ఆమె హాజరవనున్నారు. ఈ క్రమంలో నగర పరిధిలో రెండురోజులు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని హైదరాబాద్ పోలీసులు తెలిపారు. పంజాగుట్ట జంక్షన్, గ్రీన్‌ల్యాండ్ జంక్షన్, బేగంపేట్ ఫ్లై ఓవర్, శ్యాంలాల్ బిల్డింగ్, పీపీఎన్‌టీఫ్లై ఓవర్, హెచ్‌పీఎస్ అవుట్‌గేట్, ఎయిర్‌పోర్టు వై జంక్షన్, మోనప్ప జంక్షన్, యశోద హాస్పిటల్, కత్రియ హోటల్, మెట్రో రెసిడెన్సీ, పీవీ విగ్రహం, రాజ్ భవన్ రోడ్, ఖైరతాబాద్గ ÷÷–లఓల్గ÷వర్, నె÷–లకెస్ రోడ్డు, తెలుగు తల్లి జంక్షన్‌తో పాటు ఆంక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే, ఎన్టీఆర్ మార్గ్, కట్టమైసమ్మ, ఇక్బాల్ మినార్, ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం జంక్షన్, అశోక్‌నగర్ జంక్షన్, ఎన్టీఆర్ స్టేడియం ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు మాదాపూర్, రాయదుర్గం, కొత్తగూడ, గచ్చిబౌలి, కొండాపూర్ ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని చెప్పారు. ఈ క్రమంలో వాహనదారులు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని సూచించారు.

# అదానీకో న్యాయం.. ఆడపడుచుకో న్యాయమా?




హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
సోలార్ ఎనర్జీ కొనుగోలు ఒప్పందం కోసం 5 రాష్ట్రాల ప్రభుత్వాధినేతలకు ఆదానీ గ్రూప్ లంచాలు ఇచ్చినట్లు అమెరికాలో నమోదైన కేసుపై బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత ఎక్స్ వేదికగా స్పందించారు. అఖండ భారతంలో ఆడబిడ్డకో న్యాయం.. అదానీకో న్యాయమా..? అని కవిత ప్రశ్నించారు. ఆధారాలు లేకున్నా, ఆడబిడ్డను అరెస్టు చేయడం మోదీ సర్కార్‌కు ఎలాంటి అడ్డంకులు ఉండవన్నారు. అదే ఆధారాలు ఉన్నా అదానీని అరెస్టు చేయటం మాత్రం కష్టమా..? అని నిలదీశారు.ఎన్నిసార్లు ఆరోపణలు వచ్చినా, అదానీ వైపే ప్రధాని ఉంటారా..? అంటూ కవిత తెలుగు, ఇంగ్లీష్‌లో చేసిన ట్వీట్లలో ప్రధాని నరేంద్ర మోదీని ప్రశ్నించారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితను సిబిఐ, ఇడి అరెస్ట్ చేయడంతో తిహాడ్ జైలులో ఉన్నారు. కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. కవిత హైదరాబాద్ వచ్చిన తరువాత ప్రస్తుత రాజకీయ పరిణామాలపై కవిత ఎక్స్ వేదికగా తొలిసారి స్పందించారు.

# స్పీడ్ పెంచిన ఘోష్ కమిషన్



హైదరాబాద్ నవంబర్ 21,ప్రజావినికిడి:
: కాళేశ్వరం క మిషన్ విచారణలో స్పీడ్ పెంచింది. కాళేశ్వరం విచారణ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ హైదరాబాద్ కు చేరుకుని సాయంత్రం అధికారులతో సమావేశమయ్యారు. రేపటి నుంచి మరోసారి కాళేశ్వరంపై విచారణను ప్రారంభించనున్నారు. రెండు వారాల పాటు కమిషన్ విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. కమిషన్ గడువును డిసెంబర్ నెలాఖరు వరకు పొడిగించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రిటైర్డ్ ఇంజినీర్లను విచారించిన కాళేశ్వరం కమిషన్ విజిలెన్స్ ఎన్డీఎస్ఏ , కాగ్ నివేదికల ఆధారంగా ఇతర అంశాలపై విచారణ చేయనుంది. రిటైర్డ్ ఐఏఎస్‌లు, ఐఏఎస్‌ల విచారణ తర్వాత ఈ సారి ప్రజాప్రతినిధులను, గత ప్రభుత్వ పెద్దలను విచారించే అవకాశం ఉంది. అధికారుల విచారణ అనంతరం ప్రజాప్రతినిధులకు నోటీసులిచ్చి కమిషన్ విచారించనుంది. ఈ క్రమంలోనే మాజీ సీఎం కేసీఆర్, గత ప్రభుత్వ హయాంలో ఇరిగేషన్ మినిష్టర్ గా ఉన్న హరీశ్ ను కూడా కమిషన్ విచారణ చేయనుందని తెలుస్తోంది. కాళేశ్వరం కమిషన్ విచారణలో పలుమార్లు కేసీఆర్, హరీశ్ రావు పేరు ప్రస్తావనకు వచ్చిన విషయం తెలిసిందే. అఫిడవిట్ల సమర్పించిన అధికారులు, ఇంజినీర్లు, అప్పటి సీఎం కేసీఆర్, ఇరిగేషన్ మంత్రి హరీశ్ రావు పేర్లను ప్రస్తావించారు.అయితే హరీశ్ రావు ఆదేశాల మేరకే చేశామంటూ చీఫ్ ఇంజినీర్ సుధాకర్ రెడ్డి కమిషన్ కు వివరించడంతో పాటు అఫిడవిట్ సైతం ఇచ్చారు. తన విచారణ సందర్భంగా సుధాకర్ రెడ్డి మూడు సార్లు హరీశ్ రావు పేరును ప్రస్తావించారు. దీంతో తనను కూడా విచారణకు పిలుస్తారని హరీశ్ రావు ఇప్పటికే మానసికంగా సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే గత మూడు రోజులుగా ఎమ్మెల్యే క్వార్టర్స్ లో ఇరిగేషన్ ఇంజినీర్లు, రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్లు, గతంలో విచారణకు హాజరైన వారితో హరీశ్ మంతనాలు జరిపినట్లు సమాచారం. హరీశ్ విచారణ తర్వాతే తన విచారణ ఉంటుందని సన్నిహితులతో కేసీఆర్ చెబుతున్నట్లు తెలిసింది. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు బీజం పడింది కాబటి. ఒప్పందాలు, కాంట్రాక్టులు అన్నీ ఆయన హయాంలోనే జరిగాయి. ఇందులో హరీశ్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని భావించిన కేసీఆర్ ఆయనను మంత్రిపదవి నుంచ తప్పించారని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ అంశాన్ని కూడా కమిషన్ ప్రశ్నించే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇలాంటి వాటికి తానెలా సమాధానం చెప్పాలనే అంశంపై కేసీఆర్ పూర్తి స్థాయిలో సిద్ధమవుతున్నట్టు సమాచారం.

# మానవత్వం మంటగలిసింది

**రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సాయం కోసం అర్థిస్తుంటే.. ఫొటోలు, వీడియోలు తీసుకున్నారు!**

**కీసర అవుటర్ రింగ్ రోడ్డు వద్ద ఘటన**

**వెనక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో కిందపడిన ఏలేందర్**

**బాధితుడి కేకలతో డ్రైవర్ లారీని రివర్స్ చేయడంతో నుజ్జయిన కాళ్లు**

**కాపాడమని ప్రాథేయపడితే చోద్యం చూసిన జనం**


**ఆసుపత్రికి తీసుకెళ్లే లోపే మృతి**



హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి సాయం కోసం అర్థిస్తుంటే చుట్టూ చేరిన జనం మాత్రం తీరిగ్గా ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ.. వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తూ ఎంజాయ్ చేశారు. సమాచారం అందుకున్న 108 వాహనం వచ్చి ఆసుపత్రికి తరలించే సరికే అతని ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. కీసర అవుటర్ రింగ్ రోడ్డు వద్ద నిన్న జరిగిందీ ఘటన.పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన వి. ఏలేందర్ (35) కీసర రాంపల్లి చౌరస్తాలో ఉంటున్నారు. నిన్నసాయంత్రం కీసరలో తాను నిర్మిస్తున్న ఇంటిని చూసేందుకు స్కూటీపై బయలుదేరారు. ఈ క్రమంలో వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. రోడ్డుపై పడిపోయిన ఏలేందర్ తనను కాపాడాలంటూ అటుగా వెళ్తున్న వారిని చూసి కేకలు వేసి అర్థించారు. గమనించిన లారీ డ్రైవర్ వాహనాన్ని రివర్స్ చేయడంతో ఏలేందర్ కాళ్లు నుజ్జునుజ్జు అయ్యాయి. దీంతో విలవిల్లాడిపోయిన ఏలేందర్ తనను ఆసుపత్రికి తీసుకెళ్లాలని కన్నీటితో వేడుకున్నారు. ఆయన కన్నీళ్లు అక్కడున్న వారిని కదిలించలేకపోయాయి. 108కు సమాచారం అందించి అతడిని ఫొటోలు, వీడియోలు తీస్తూ గడిపేశారు. ఆ తర్వాత 108 వాహనం వచ్చి బాధితుడిని ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే అతడు చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. లారీ డ్రైవర్ లక్ష్మణ్‌పై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# 'బాబ్రీ తీర్పుతో ముస్లిం ప్రార్థనా స్థలాలు లక్ష్యంగా మారాయి


## అసదుద్దీన్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
సంచలన వ్యాఖ్యలు, ఆరోపణలతో నిత్యం వార్తల్లో నిలిచే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. బాబ్రీ మసీద్ తీర్పుతో ముస్లిం ప్రార్థన మందిరాలు కొందరికి లక్ష్యంగా మారాయంటూ ఆయన ధ్వజమెత్తారు. సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు..ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. మొన్నటికి మొన్న తిరుమల వ్యవహారంపై తీవ్రంగా వ్యవహరించిన అసదుద్దీన్ తాజాగా ఉత్తరప్రదేశ్ సంభాల్‌లోని చందౌసికి చెందిన షాహీ జామా మసీదు కేసుకు సంబంధించి ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేశారు. బాబ్రీ మసీదు తీర్పు భారతదేశంలోని ముస్లిం ప్రార్థనా స్థలాలను లక్ష్యంగా చేసుకునేందుకు కొందరిని ప్రోత్సహిస్తుందని చెప్పుకొచ్చారు.ఈ విషయమై ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేస్తూ.. 'మసీదును నిర్మించడానికి ఆలయాన్ని కూల్చివేశారంటూ పిటిషన్ వేసిన మూడు గంట్లోనే ప్రాథమిక సర్వేకు సివిల్ జడ్జి ఆదేశించారు. పిటిషన్ వేసిన లాయర్ యూపీ ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సెల్‌గా ఉన్నారు. పిటిషన్ వేసిన రోజు సర్వే నిర్వహించారు. బాబ్రీ విషయంలో కూడా ఇలాగే వ్యవహరించారు. అవతలి వారి వాదన కూడా వినకుండానే కోర్టు ఆదేశాలిచ్చిన గంటలోపే బాబ్రీ తాళాలు తెరిచారంటూ' అసదుద్దీన్ రాసుకొచ్చారు. ఇంతటి వేగాన్ని సాధారణ కేసుల్లో ఎందుకు చూపించరంటూ అసదుద్దీ ప్రశ్నించారు. కోర్టులు ఇలా ఆదేశాలను ఇస్తూ పోతుంటే ప్రార్థనా స్థలాల చట్టం కేవలం చిత్తు కాగితంతో సమానమవుతుంది. ఇలాంటి వ్యాజ్యాలను వెంటనే కోర్టులకు చేరకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని తీసుకొచ్చారని అసదుద్దీన్ గుర్తు చేశారు. వందల ఏళ్ల నుంచి ప్రార్థనల కోసం ఉపయోగిస్తున్న మసీదులపై.. మతపరమైన ప్రేరేతి వ్యాజ్యాలు వేస్తున్నారన్నారు. న్యాయస్థానాలు వీటిని మొదట్లోనే తుంచి వేయాలని అసదుద్దీన్ డిమాండ్ చేశారు.ఇదిలా ఉంటే.. షాహీ జామా మసీదును సర్వే చేయాలని మంగళవారం కోర్టు ఆదేశించింది. 1526లో అక్కడ ఉన్న ఆలయాన్ని కూల్చివేసి మసీదు నిర్మించారని మహంత్ దాఖలు చేసిన పిటిషన్ నేపథ్యంలో కోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. మసీదును నిర్మించేందుకు ఆలయాన్ని కూల్చివేశారా లేదా అని తెలుసుకోవడానికి మసీదు స్థలంలో ప్రాథమిక సర్వే నిర్వహించాలని కమిషనర్‌గా నియమించిన రమేష్ చంద్ రాఘవ్‌ను సివిల్ జడ్జి ఆదిత్య సింగ్ ఆదేశించారు. నవంబర్ 29వ తేదీలోగా సర్వే నివేదిక ఇవ్వాలని కోర్టు ఆదేశించింది.

# పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది

**పోలీసులకు కీలక సూచనలు చేసిన కమిషనర్ సివి ఆనంద్**



హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:):
పోలీసులు తాగుడుకు దూరంగా ఉండాలని సీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. యువ పోలీసులు ఫిజికల్ ఫిట్‌నెస్‌గా ఉండాలని.. దేనికి ఏ వ్యసనానికి కూడా లొంగకూడదని.. బానిస కాకూడదని తెలిపారు. 'నా 33 ఏళ్ల పోలీస్ సర్వీస్‌లో 75 కేజీల మధ్యలో ఉన్నాను. నేను చాలా ఫిట్‌గా ఉన్నాను. 30 ఏళ్ల క్రితం నా ఐపీఎస్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో వేసుకున్న పోలీస్ డ్రెస్ ఇప్పుడు కూడా వేసుకోగలను. మీరు శిక్షణ పొందిన పేట్లబురుజు ఆర్మ్ రిజర్వ్ ఇన్చార్జ్ డీసీపీ దక్షిణామూర్తిని చూడండి ఎంత ఫిట్‌గా ఉన్నారో. ఫిట్‌గా ఉన్న వారిని ఆదర్శంగా తీసుకోండి అని సూచించారు.. పోలీసుల జీతాల విషయంలో ప్రభుత్వం ఎక్కువగా పెంచదు. పోలీసులు అవినీతికి పాల్పడకూడదు. ఐపీఎస్ లాంటి ఉద్యోగంలో కూడా జీతాలు అంతంత మాత్రమే. పోలీస్ శాఖలో మెల్లమెల్లగా జీతాలు పెరుగుతూనే ఉంటాయి. పోలీస్ ఉద్యోగం అంటే టెస్ట్ క్రికెట్ మ్యాచ్ లాంటిది. ఒక పరిస్థితిలో నేను కూడా రాజీనామా చేసి వెళ్ళలనుకున్నా. శిక్షణ తీసుకున్నవారు మీ సేవల ద్వారా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురండి' అంటూ సీపీ ఆనంద్ పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 8,047 మంది పోలీస్ కానిస్టేబుల్స్ శిక్షణ పొందారని.. ఇందులో 4,100 సివిల్, 3,685 మంది ఏఆర్ 2,028 కమ్యూనికేషన్స్, 18 మంది పోలీస్ ట్రాన్స్ పోర్ట్ ఉన్నారని సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఇందులో నుంచి హైదరాబాద్ పోలీస్ శాఖకు 1,128 మందిని ట్రైనింగ్ కోసం కేటాయించినట్లు చెప్పారు. ఇప్పుడు 747 మంది దీక్షత్ పాసింగ్ అవుట్ పరేడ్ చేశారన్నారు. 3,081 మంది మహిళల కానిస్టేబుల్స్ పోలీస్ శిక్షణ పొందారన్నారు. 1992లో తాను ఐపీఎస్ శిక్షణ పొందాను పాసింగ్ అవుట్ పరేడ్ జరిగింది. అప్పుడు 80 మంది ట్రైనీ ఐపీఎస్‌లు పాల్గొన్నాం. వర్షం పడుతున్నా పరేడ్ పూర్తి చేశాం' అంటూ ఆనాటి విషయాలను గుర్తుచేశారు సీపీ. శిక్షణ పొంది పోలీస్ శాఖలో 35 ఏళ్లు గడపబోతున్నారని... శిక్షణ పొందిన వారు అకుంఠిత దీక్షతో పని చేయాలని సూచించారు. పోలీసులు రాజ్యాంగానికి విధేయత చూపాలన్నారు. పోలీసులు నిజాయితీగా, న్యాయంగా పనిచేయాలని తెలిపారు. ప్రజల మాన, ప్రాణాలు కాపాడడంలో కర్తవ్యం నెరవేర్చాలని స్పష్టం చేశారు. పోలీస్ డ్యూటీ అంటే ఒత్తిడితో కూడుకున్నదని ఆయన తెలిపారు. అలాగే పోలీసులకు సీపీ ముఖ్య సూచన చేశారు. కాగా.. తెలంగాణా పోలీస్ అకాడమిలో కానిస్టేబుల్స్ నాలుగవ పాసింగ్ ఔట్ పరేడ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీజీపీ జితేందర్, పోలీసులు ఉన్నతాధికారులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

# మధుర నగర్ లో సీసీ కెమెరాలు ప్రారంభించిన

## నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్,ఏసీపీ కృష్ణయ్య..





ప్రజావినికిడి,(ఎల్బీనగర్): గురువారం రోజు నాగోల్ డివిజన్ పరిధిలోని మధుర నగర్ లో లక్ష 60వేల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమంకి ముఖ్య అతిథిలుగా ఏసీపీ కృష్ణయ్య తో కలిసి ప్రారంభించిన నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, ఒక సీసీ కెమెరాఈ వంద మంది పోలీబిస్ సిబ్బందితో సమానమని అన్నారు.దొంగతనాలు, చైన్‌స్నాచింగ్,ఇతర నేరాలను ఆరికట్టడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారుజెకార్యాలయాలు, వీధులలో కాకుండా ప్రతి ఇంట్లోనూ వ్యక్తిగతంగా సీసీ కెమెరాలు ఏర్పా టు చేసుకొని నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు.ల్ఉడుల్ ల్ల్ యువత అసాంఘిక కార్యాకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయికి అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకోవద్దని అన్నారు. నా నుండి ఎలాంటి సహాయ సహకారాలు కావాలి అన్న నా వంతు కృషి నేను చేస్తాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో సీఐ సూర్య నాయక్ ఈ శివ నగప్రసాద్ ల్,కాలనీ ప్రెసిడెంట్ ధనరెడ్డి,సెక్రటరీ (య్యానివాస్ రెడ్డి, కాలనీ సభ్యులు మనిదీప్,సూర్య ప్రకాష్,సాయికిరణ్, వెంకటేష్,అరుణ్ యాదవ్, కార్తీక్ ,సురేష్, నాయకులు, సిద్దల ఐలయ్య, డప్పు రాజు, పాల్వాయి సంజీవ రెడ్డి,రావుల శ్రీనివాస్, నరేందర్ రెడ్డి,ప్రభాకర్ గౌడ్,రాధిక,సంతు,శివ తదితరులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ లో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి..



ప్రజావినికిడి,(ఎల్బీనగర్):
బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ పరిధిలోని తెలంగాణ చౌరస్తా వద్ద గురువారం రోజు ఎల్బీనగర్ శాసనసభ్యుడు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ,ఈ చౌరస్తా మీదుగా దాదాపు 50 కాలనీవాసులు నిత్యం రాకపోకలు సాగిస్తారు.ఇట్టి నేపథ్యంలో ఉదయం, సాయంత్రం వేళల్లో అలాగే వివాహాలు ఉన్న రోజుల్లో ప్రజలు తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొనడం జరుగుతుంది.ఈ విషయాన్ని గతంలో చుట్టుపక్కల కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.దానిలో భాగంగా నేడు తెలంగాణ చౌరస్తా నందు పర్యటించి తక్షణమే రోడ్డు ప్రక్కనే ఉన్న కృష్ణ వాటర్ ఛాంబర్,ట్రాన్స్ఫార్మర్స్,స్తంభాలు వెనక్కు జరిపి రోడ్డు వెడల్పు చేయాలని అధికారులను ఆదేశించారు.ఆ పనులు పూర్తి అయితే ప్రజలకు ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి లభిస్తుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,సుమన్ గౌడ్,అనిల్ చౌదరి,ప్రభాకర్ రెడ్డి,పొగుల రాంబాబు,శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గుజ్జ సత్యం జన్మదిన వేడుకలు..




ప్రజావినికిడి,(అంబర్ పేట్):
హైదారాబాద్ అంబర్ పేట్ విద్యానగర్ లోని బీసీ భవన్ లో బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ,బీసీ నాయకులంతా ఏకమై చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు సాధించాలని పిలుపునిచ్చారు. బీసీలు రాజకీయంగా బలపడినప్పుడే అనుకున్న రిజర్వే షన్లను పొందుతా మన్నారు.అనంతరం గుజ్జసత్యం బర్త్ డే సందర్భంగా ప్రముఖ గాయకులు రూపొందించిన ఆల్బమ్ను విడుదల చేశారు.ఈకార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ,గౌరిగ మల్లేష్, వేముల రామకృష్ణ, అంజి,పగిల సతీష్, పృద్వి,సురేష్, సూర్యనారాయణ ఆర్య,నరేందర్, ఉదయ్ నేత,నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచాలి..

**కొత్త పెన్షన్లు మంజూరు చేయాలి..**

**వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగించాలి..**

**పెన్షన్ పెంపు కోసం నవంబర్ 20నుండి డిసెంబర్ 9వరకు రాష్ట్ర వ్యాప్త ఉద్యమం..**

**డిసెంబర్ 9న ఛలో హైదరాబాద్ జయప్రదం చేద్దాం..**

**ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షుడు ఆశన్న భుజంగారెడ్డి..**



ప్రజావినికిడి,(షాద్ నగర్):
వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచాలని, పెండింగ్లో ఉన్న ఆసరా పెన్షన్స్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 20నుండి డిసెంబర్ 9వరకు రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా ఉద్యమం చేస్తామని,డిసెంబర్ 9న ఛలో హైదరాబాద్ నిర్వహిస్తుమని ఎన్ పి ఆర్ డి జిల్లా అధ్యక్షుడు అశాన్నగారి భుజంగరేడ్డి స్పష్టం చేశారు.దీనిలో భాగంగా ఫరూఖ్ నగర్ మండలం చించోడ్ గ్రామంలో గ్రామ సెక్రటరీ వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అశాన్నగారి భుజంగరేడ్డి మాట్లాడుతూ,అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచుతామని, వృద్ధులు, వితంతువుల పెన్షన్ 4000 లకు పెంచుతామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 11నెలలు గడిచిన ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు.పెన్షన్ పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడం ఎంతవరకు సమంజసమన్నారు.పెన్షన్ పెంపు కోసం 44 లక్షల మంది ఆసరా లబ్ధిదారులు,కొత్త పెన్షన్స్ మంజూరు కోసం 24.85 లక్షల మంది ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.వికలాంగుల సంక్షేమ శాఖను ప్రత్యేక శాఖగా కొనసాగిస్తూ గత ప్రభుత్వం జీవో 34 ఇచ్చిందని,దాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వికలాంగుల సంక్షేమ శాఖను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. 33 జిల్లాలో వికలాంగుల శాఖలో ఉద్యోగులను నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామకాల్లో శరీరక వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గించాలని డిమాండ్ చేశారు.తీవ్ర వైకాల్యం కలిగిన వికలాంగులకు 25,000 ప్రత్యేక అలావెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్ లాగ్ పోస్టులను గుర్తించి,వాటి భర్తీ కోసం ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.వికలాంగులకు ఉచిత బస్ ప్రయాణం సౌకర్యం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నించారు. వికలాంగుల చట్టాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా కేంద్రాల్లో నిరుద్యోగ వికలాంగులకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఐకేపీ ఆధ్వర్యంలో నడుస్తున్న నైబర్ హుడ్ సెంటర్స్ను బలోపేతం చేసి అందులో పనిచేస్తున్న సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ అమలు చేయడానికి అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు.వికలాంగుల సంక్షేమనికి బడ్జెట్ లో 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సదరం సర్టిఫికెట్స్ రిజెక్ట్ అయినా వారికి సర్టిఫికెట్స్ పునరుద్దరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చేగురి శేఖర్ గౌడ్,మహమ్మద్ గౌస్,శ్రీను,రహిమ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న రాజ్ కుమార్ రెడ్డి



ప్రజావినికిడి,(నారాయణపేట):నారాయణపేట-మహబూబ్ నగర్ రోడ్డు మార్గంలో దన్వాడ సమీపంలో యువకులు వెళ్తున్న ద్విచక్ర వాహన ప్రమాదవశాత్తు చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. సహాయం అందించాలని కోరుతూ ఆ యువకులు వేడుకునే విషయాన్ని గమనించిన భీష్మ రాజ్ ఫౌండేషన్ చైర్మన్ కె.రాజ్ కుమార్ రెడ్డి కారును ఆపారు.చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన బైక్ ను బయటకు తీసి వారికి నీటిని తాగించి సురక్షితంగా అక్కడి నుండి పంపించారు. రాజ్ కుమార్ రెడ్డి తదితరులు చేసిన సహాయానికి ప్రమాదానికి గురైన యువకులు ధన్యవాదాలు చెప్పారు.రాజ్ కుమార్ రెడ్డి వెంట ఫౌండేషన్ సభ్యులు తిప్పన్న, లక్షణ్,శివ,మహేష్ తదితరులు ఉన్నారు.


# భద్రకాళీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు

**- దర్శించుకున్న బి.సి డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్ రావు**




**వరంగల్ నవంబర్ 21,ప్రజావినికిడి:**
వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన భద్రకాళీ దేవస్థానాన్ని బి.సి డెడికేటెడ్ కమీషన్ చైర్మన్ బి. వెంకటేశ్వర్ రావు, రిటైర్డ్ ఐ.ఏ.ఎస్ సైదులు, ఐ.ఎఫ్.ఎస్, సెక్రెటరీ, బి.సి కమీషన్ రమేష్, డిప్యూటీ డైరెక్టర్ జిల్లా అధికారులు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ప్రముఖులకు ఆలయ అధికారులు అద్దంకి విజయ్ కుమార్, అర్చకులు మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ముందుగా వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజానంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో అర్చకులు, వేద పండితులు ప్రముఖులకు మహదాశీర్వచనం నిర్వహించి, అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి, ప్రసాదములు అందజేసినట్లు భద్రకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శేషభారతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై కేసు నమోదు



వరంగల్ ,నవంబర్ 21,ప్రజావినికిడి:
బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై పోలీసు కేసు నమోదయింది. భూకబ్జా వ్యవహారంలో హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ లో ఆయనపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... నగరంలోని వినాయకనగర్ లోని దుర్గాదేవి కాలనీలో 500 గజాల స్థలాన్ని శంకర్ నాయక్ కబ్జా చేసేందుకు యత్నించినట్టు ఆయనపై ఆరోపణలు వచ్చాయి.
ఈ స్థలానికి చెందిన యజమానులకు చెందిన కంటెయినర్ తో పాటు గృహోపకరణ వస్తువులను కూడా దొంగిలించిన విషయంలో శంకర్ నాయక్ పై పలు సెక్షన్ల కింద కేసు నమోదయింది. బాధితులపై శంకర్ నాయక్ దాడికి పాల్పడ్డారని, వారి సెల్ ఫోన్లు కూడా లాక్కున్నారనే ఆరోపణలు ఉన్నాయి. శంకర్ నాయక్ పై వరుసగా ఫిర్యాదులు అందుతుండటంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని విచారణ చేపట్టారు. మరోవైపు 2017లో కూడా మహబూబాబాద్ లో శంకర్ నాయక్ పై కేసు నమోదయింది. అప్పటి జిల్లా కలెక్టర్ ప్రీతిమీనాతో అనుచితంగా ప్రవర్తించారంటూ కేసు నమోదు చేశారు. అయితే ఆయనపై మోపిన అభియోగాలు రుజువు కాకపోవడంతో ప్రజాప్రతినిధుల కోర్టులో కేసు వీగిపోయింది.

# పట్నం నరేందర్ రెడ్డి అరెస్ట్...

# హైకోర్టులో భార్య శృతి పిటిషన్

**సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా అరెస్ట్ చేశారని శృతి పిటిషన్**

**అరెస్ట్ చేసే సమయంలో నిబంధనలు పాటించలేదన్న పట్నం శృతి**

**పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**





హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో తన భర్త పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేయడంపై ఆయన భార్య పట్నం శృతి హైకోర్టులో కోర్టు ధిక్కారణ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా తన భర్తను అరెస్ట్ చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఒక వ్యక్తిని అరెస్ట్ చేసే సమయంలో అనుసరించే నిబంధనలు పాటించలేదన్నారు.ఈ సందర్భంగా డీకే బసు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆమె తన పిటిషన్‌లో ఉదహరించారు. పోలీసులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ పిటిషన్‌లో ప్రతివాదులుగా ఐజీ వి.సత్యనారాయణ, వికారాబాద్ ఎస్పీ కె.నారాయణరెడ్డి, బొమ్మరాస్పేట ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, ఎస్సై మహమ్మద్ అబ్దుల్ రవూఫ్‌ను చేర్చారు.
తన అరెస్టును సవాల్ చేస్తూ పట్నం నరేందర్ రెడ్డి హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై ఈరోజు వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. లగచర్లలో భూసేకరణకు వ్యతిరేకంగా ఆయన ప్రజలను రెచ్చగొట్టారని ఆరోపించారు. సంబంధిత

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

# ఎగ్జిట్ పోల్స్ ఫలితాల పట్ల ప్రజల్లో పెరుగుతోన్న అనాసక్తత




హైదరాబాద్,నవంబర్ 21,ప్రజావినికిడి:
దేశంలోనే కాదు ఎక్కడ ఎన్నికలు జరిగినా సర్వే సంస్థల ద్వారా ప్రజాభిప్రాయంపై ముందే ఒక అంచనా వస్తుంది. అయితే గత కొన్నేళ్లుగా ఈ సర్వే అంచనాలు తలకిందులవుతున్నాయి. వాటిలో ఖచ్చితత్వం లోపించింది. దాంతో ప్రజలు సర్వే ఫలితాల పట్ల ఆసక్తిని కోల్పోతున్నారు. ఇటీవల ముగిసిన అమెరికా అధ్యక్ష ఎన్నికలతో పాటు .. మన దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలు.. ఇటీవలి హర్యానా, జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు అందుకు తాజా ఉదాహరణలు. అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్, డెమాక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్ మధ్య హోరా హోరీ తప్పదని దాదపు అన్ని సర్వేలు చెప్పాయి. కానీ ఫలితం అందుకు భిన్నంగా వచ్చింది. ట్రంప్ బంపర్ మెజార్టీతో గెలిచారు. అలాగే, ఈ ఏడాది జరిగిన మన దేశ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు నల్లేరు మీద నడక అన్నారు. గత రెండు ఎన్నికల్లో కంటే ఈ సారి ఇంకా ఎక్కువ సీట్లు వస్తాయని దాదాపు అన్ని సర్వేలు, ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. చివరకు ఏమి జరిగిందో తెలుసు. ఏపీ ఎన్నికల్లో కూడా అన్ని అంచనాలు తప్పి టీడీపీ దాని మిత్రపక్షాలు కనివిని ఎరుగని గెలుపును సొంతం చేసుకున్నాయి. అలాగే అత్యంత తాజాగా హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కాం గ్రెస్ విజయం తథ్యమని దాదాపు అన్ని సర్వే సంస్థలు ముక్తకంఠంతో ఘోషించాయి. చివరకు ఏమి జరిగింది? బీజేపీ అఖండ విజయం సాధించింది. సాధారణ సర్వేలు లెక్కతప్పితే అనుకోవచ్చు ..కానీ ఎన్నికలు ముగిసిన వెంటనే జరిపే ఎగ్జిట్ పోల్స్ లెక్కలు కూడా ఘోరంగా తప్పుతున్నాయి. అందువల్ల ప్రజలు మునపటిలా ఇప్పుడు ఎగ్జిట్ పోల్ ఫలితాల పట్ల ఆసక్తి ప్రదర్శించటం లేదు. తాజాగా వెల్లడైన మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ పట్లను ఎవరూ పెద్దగా పట్టించుకోవట్లేదు. ఇటు రాజకీయ నేతలు, అటు ప్రజల్లో కూడా దీనిపై పెద్ద చర్చ లేదు. చర్చలు కేవలం మీడియా సంస్థలకే పరిమితమయ్యాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ ఎగ్జిట్ పోల్స్ పై టీవీ డిబేట్లకు దూరంగా ఉంది. కాగా, మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసే అవకాశముందని ఎక్కువ సర్వేలు అంచనా వేశాయి. 288 స్థానాలు కలిగిన మహారాష్ట్ర అసెంబ్లీలో కనీస మెజార్టీ సాధించాలంటే 145 సీట్లు గెలవాలి. బీజేపీ నేతృత్వంలోని కూటమి 150 నుంచి 170 స్థానాలు గెలుచుకునే అవకాశముందని మాట్రిజ్ సర్వే అంచనా వేసింది. కాంగ్రెస్ కూటమి 110 నుంచి130 స్థానాలు సాధించవచ్చని అంచనా వేసింది. ఇతరులు 8 - 10 సీట్లు గెలుచుకోవచ్చని తెలిపింది. పీపుల్స్ పల్స్ అంచనా ప్రకారం, మహాయుతి 182 స్థానాల్లోనూ, మహా వికాస్ అఘాడీ 97 స్థానాల్లోనూ గెలిచే అవకాశముంది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి 152 - 160 స్థానాలను సాధించే అవకాశముందని, కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ 130 - 138 స్థానాల్లో గెలిచే అవకాశముందని చాణక్య స్టాట్రజీస్ అంచనా వేసింది. మహాయుతి 137- 157 సీట్లు, మహా వికాస్ అఘాడీ 126-146 స్థానాలు గెలుచుకునే అవకాశముందని పీ? మార్క్ సర్వే పేర్కొంది. లోక్‌షాహి-మరాఠి-రుద్ర సర్వే అంచనాల ప్రకారం, మహాయుతి 128 - 142 స్థానాల్లో, ఎంవీఏ 125 ? 140 సీట్లలో గెలుపొందే అవకాశముంది. టైమ్స్ నౌ-జేవీసీ అంచనా ప్రకారం, మహాయుతి 150-167 సీట్లు, ఎంవీఏ 107- 125 స్థానాలు, ఇతరులు 13 నుంచి 14 సీట్లు గెలుచుకునే అవకాశముంది. ఇక, ఝార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు రెండు విడతల్లో పోలింగ్ జరిగింది. ఝార్ఖండ్‌లో దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్ సర్వేలూ.. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి విజయం సాధిస్తుందన్న అంచనాలను వెలువరించాయి. ఎన్డీఏకు 42-47 సీట్లు రావొచ్చని మాట్రిజ్ సర్వే అంచనా వేసింది. జేఎంఎం నేతృత్వంలోని ఆల్ ఇండియా కూటమికి 25-0 సీట్లు, ఇతరులకు 1-4సీట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పింది. పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం, ఎన్డీఏకు 42-48 సీట్లు, ఇండియా కూటమికి 16-23 సీట్లు వచ్చే అవకాశం ఉంది. ÷ఖటికి భిన్నంగా ఝార్ఖండ్‌లో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉందని యాక్సిస్ మై ఇండియా అంచనా వేసింది. ఇండియా కూటమి 53 స్థానాలు, ఎన్డీఏ 25 స్థానాలు గెలుచుకోవచ్చని ఈ సర్వే తెలిపింది. ఝార్ఖండ్‌లో ఎన్డీఏ 45 నుంచి 50 సీట్లు సాధించే అవకాశం ఉందని చాణక్య స్టాట్రజీస్ అంచనా వేసింది. ఇండియా కూటమి 35-38 సీట్లు, ఇతరులు 3-5 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. టైమ్స్ నౌ-జేవీసీ సర్వే, ఎన్డీఏ 40-44 స్థానాలతో ముందంజలో ఉంటుందని, ఇండియా కూట మి 30-40 స్థానాలు గెలుచుకునే అవకాశముందని, ఇతరులు ఒక చోట గెలుపొందుతారని అంచనావేసింది. ఈ నెల 23న ఎన్నికల ఫలితాలు వెల్లడవుతాయి. ఈసారైనా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమవుతాయో లేదో చూడాల్సివుంది.
........

## గత ఏపీ సర్కార్ కు చుట్టుకుంటోన్న

# అదాని వ్యవహారం

## సోలార్ విద్యుత్ కొనుగోలుకు భారీ డీల్ కు యత్నం!!

### ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచం ఇచ్చేందుకు ప్రయత్నం

### అమెరికా విచారణ సంస్థ ఎఫ్ బీఐ వెల్లడి



అమరావతి,నవంబర్ 21,ప్రజావినికిడి::
దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి సంబంధించిన ఓ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. సోలార్ విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన ఓ భారీ డీల్ కుదుర్చుకునేందుకు.. ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్-ఎఫ్‌బీఐ విచారణ చేపట్టింది.ఈ వివాదాస్పద వ్యవహారం క్రమంగా.. ఆంధ్రప్రదేశ్ గత సర్కార్ కు చుట్టుకుంటోంది. 2019- 2024 మధ్య అధికారంలోని ప్రభుత్వంతో గౌతమ్ అదానీ.. ఈ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నడిపినట్లు అమెరికా విచారణ సంస్థ ఎఫ్‌బీఐ పరిశోధనలో వెల్లడైంది. ఇందుకోసం.. దాదాపు రూ.1,750 కోట్లు చేతులు మారినట్లు అమెరికా విచారణ సంస్థ.. ఆ దేశ కోర్టుకు సమర్పించిన ఫైలింగ్ లో వెల్లడించింది.లాభదాయకమైన సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు రూ. 2.029 కోట్లు లంచం ఇచ్చినందుకు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సాగర్ అదానీ, మరో ఆరుగురు వ్యక్తుల ప్రయత్నించినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో మరింత లోతైన దర్యాప్తు చేపడతామని ప్రకటించిన ఆమెరికా విచారణ సంస్థ.. ప్రాథమిక నివేదికను కోర్టుకు అందించింది. ఈ కుట్రలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తి సహకారం ఎక్కువగా ఉందన్న ఎఫ్‌బీఐ.. తేదీలతో సహా వారి మధ్య భేటీలను వెల్లడించి, ఆశ్చర్యపరిచింది.భారత్ లో అతిపెద్ద సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకునేందుకు గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సహా మరో ఆరుగురు.. ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వజూశారని అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ ఆరోపిస్తోంది. అయితే.. ఈ ఒప్పందాలను చూపించి బ్యాంకులు, ఇన్వెస్టర్లను తప్పుడు సమాచారంతో మోసం చేసి నిధులు సమీకరించేందుకు ప్రయత్నించారనేది ప్రధాన ఆరోపణ. ఇందులో ఆమెరికా ఇన్వెస్టరు సైతం ఉండడంతో.. తమ దేశ పెట్టుబడిదారుల్ని మోసం చేస్తున్నారన్న కారణంతో ఆమెరికా దర్యాప్తు ప్రారంభించింది. ఈ దర్యాప్తునకు సంబంధించిన అంశాలను తెలుపుతూ.. కోర్టులో ఎఫ్‌బీఐ ఫైలింగ్ చేసింది. రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు.. అదానీ గ్రీన్ ఎనర్జీ గ్రూప్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల సహకారం కోరిన అదానీ, ఇతర నిందితులు.. ప్రతిగా భారీగా లంచాలు ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా.. భారత ప్రభుత్వంలోని వ్యక్తులకు రూ.2,029 కోట్లు లంచంగా ఇచ్చేందుకు ప్రయత్నించారని ఎఫ్‌బీఐ నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకునే ఒప్పందాలతో అదానీ గ్రీన్ ఎనర్జీ, దాని అనుబంధ సంస్థలకు పెద్ద మొత్తంలో లాభం చేకూరుతుందని పేర్కొంది.అలాగే.. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య విద్యుత్ విక్రయ ఒప్పందం ( కుదుర్చేందుకు అదానీ స్వయంగా ప్రయత్నించారు. ఇందుకోసం.. అతను ఆంధ్రప్రదేశ్ లోని అత్యున్నత స్థాయి కార్యనిర్వహాక వ్యక్తిని కలిశారు అని అమెరికా విచారణ సంస్థ ఎఫ్ బీఐ స్పష్టంగా వెల్లడించింది. ఇక్కడే అసలు విషయం పూర్తిగా వెల్లడైంది. ఆమెరికా విచారణ సంస్థ తేదీలతో సహా తెలిపినట్లుగా..2021లో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. నాడు విద్యుత్ సరఫరా ఒప్పందాలపై చర్చలు జరిగినట్లు ప్రభుత్వం తెలపగా.. దాదాపు ఏడు మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ముఖ్యమంత్రి జగన్ అంగీకారం తెలుపారు. ఇది.. భారత్ లోని మరే ఇతర రాష్ట్రాలు చేసుకోలేనంత భారీ ఒప్పందంగా.. అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వెల్లడించింది.

## మన్ కీ బాత్ తరహాలోనే ఏపీలో వినూత్న కార్యక్రమం

### ప్రజలతో నేరుగా మాట్లాడనున్న ముఖ్యమంత్రి

### సంక్రాంతి నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం



అమరావతి,నవంబర్ 21,ప్రజావినికిడి:
ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ తరహాలోనే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రజలతో నేరుగా మాట్లాడనున్నారు. సంక్రాంతి నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం దీనిపై చర్చలు జరుగుతున్నాయి. ఆయన హయాంలోనే 1995 నుంచి 2004 మధ్య డయల్ యువర్ సీఎం నిర్వహించారు. ఇప్పుడు మన్ కీ బాత్, డయల్ యువర్ సీఎం కార్యక్రమాల కలయిక ద్వారా ప్రజలతో మమేకం అయ్యేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. త్వరలోనే ప్రజలతో ముఖా ముఖి సమావేశాలు నిర్వహించనున్నట్లు అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆడియో గానీ వీడియో విధానంలో గానీ ఈ కార్యక్రమం నిర్వహించే అవకాశం ఉంది.

## పదో తరగతి పబ్లిక్ పరీక్షలు తెలుగులోనూ రాసుకోవచ్చు

### కీలక నిర్ణయం తీసుకున్న ఏపీ విద్యాశాఖ

అమరావతి నవంబర్ 21,ప్రజావినికిడి:
రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు విద్యాశాఖ తీపికబురు చెప్పింది. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు వారి సౌలభ్యాన్ని అనుసరించి తెలుగు లేదా ఆంగ్ల మాధ్యమాల్లో పరీక్షలు రాసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ మేరకు తెలియజేస్తూ విద్యాశాఖ ప్రకటన జారీ చేసింది. టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసే సమయంలో విద్యార్థులు మాధ్యమాన్ని ఎంపిక చేసుకోవచ్చని, ఇప్పటికే దరఖాస్తులు సమర్పించిన వారు కావాలంటే ఐచ్ఛికాన్ని మార్చుకోవచ్చని సూచించింది. గత ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 1 నుంచి 6 తరగతుల విద్యార్థులను ఒకేసారి ఆంగ్ల మాధ్యమంలోకి మార్చుతూ 2020-21లో ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే.అయితే ఆంగ్ల మాధ్యమం అమలుపై సుప్రీంకోర్టులో కేసు దాఖలైనందున 'ఇంగ్లిష్ మీడియం' అని వాడకుండా 'ఒకే మాధ్యమం' ఉండాలని కోర్టు ఆదేశించారు. అనధికారికంగా ఆంగ్ల మాధ్యమమే అన్నట్లు వ్యవహరించారు. దీంతో ఒక్కో తరగతి ఆంగ్ల మాధ్యమంలోకి మార్చుతున్నట్లు ప్రకటిస్తూ, పదో తరగతిలోకి వచ్చిన విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షలు రాయాలనే నిబంధన పెట్టారు. ఒకే మాధ్యమం అమలు చేయాలని చెప్పడం మినహా ఏ మాధ్యమం అనేది కోర్టు స్పష్టంగా చెప్పకపోవడంతో గందరగోళం నెలకొంది. దీంతో చాలా పాఠశాలల్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను కొనసాగించారు. ఇలా తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులు తెలుగులో పరీక్షలు రాసేందుకు అవకాశం ఇవ్వాలంటూ ప్రధానోపాధ్యాయులు కోరడంతో కూటమి సర్కార్ ఈ ఒక్క ఏడాదికి అనుమతివ్వాలని నిర్ణయం తీసుకుంది.ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా పదోతరగతి చదువుతున్న విద్యార్థులు 6.20 లక్షల మంది ఉన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ నామినల్ రోల్స్‌లో 4.94 లక్షల మంది విద్యార్థుల వివరాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నమోదు చేశారు. ఇందులో 39 వేలకుపైగా విద్యార్థులు తెలుగు మాధ్యమంలో పరీక్షలు రాస్తారని తెలిపారు. గత ప్రభుత్వం అన్ని పాఠశాలల్లోనూ ఆంగ్ల మాధ్యమం అమలవుతున్నట్లు రికార్డుల్లో నమోదు చేసింది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి వేరేగా ఉంది. విద్యార్థులకు ద్విభాష పాఠ్యపుస్తకాలు ఇస్తున్నందున చాలాచోట్ల తెలుగులోనే పాఠాలు చెబుతున్నారు. ఇక విద్యార్థులు కూడా మాతృభాషలోనే చదువుతున్నారు. ఒకేసారి తెలుగు మాధ్యమం నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి మార్పు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక పదో తరగతికి వచ్చిన తెలుగు మీడియం పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో పరీక్షలు రాయాలంటే ఇబ్బంది పడుతున్నారు. దీనిని గుర్తించిన విద్యాశాఖ ఈ ఏడాదికి తెలుగు మీడియంలో పబ్లిక్ పరీక్షలు రాసేందుకు అవకాశం ఇచ్చింది. పబ్లిక్ పరీక్షల ఫీజును నంబరు 26 వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా చెల్లించేందుకు అవకాశం ఉంది.

## ఏపీపై అల్పపీడన ప్రభావం.. పలు జిల్లాల్లో భారీ వర్షాలు



అమరావతి,నవంబర్ 21,ప్రజావినికిడి:
ఆంధ్రప్రదేశ్ లో మరోసారి భారీ వర్షాలు కురుస్తాయని చెబుతోంది వాతావరణశాఖ. అండమాన్ సముద్రంలో నేడు ఉపరితల ఆవర్తనం ఏర్పడనున్నట్లు చెప్పింది. ఈ ప్రభావంతో ఈనెల 23న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత రెండు రోజుల్లో ఈ అల్పపీడనం వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈనెల 24వ తేదీ నుంచి అల్పపీడన ప్రభావంత తమిళనాడు, కేరళలో విస్తారంగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరశాఖ తెలిపింది. కాగా రైతులను ఇప్పటి నుంచే వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేడు, శుక్రవారం, శనివారం ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు పడవని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. అలాగే రాత్రి ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. రాత్రిపూట ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. ఉదయం 10గంటల వరకు కూడా చాలా ప్రాంతాల్లో పొగ మంచు కమ్ముకుంటోంది. పగటి సమయంలో ఉష్ణోగ్రతలు కూడా క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో చలి తీవ్రత తీవ్రంగా పెరిగింది. ఉమ్మడి విశాఖ మన్యంలో జనాన్ని చలి వణికిస్తోంది. మంగళవారం డుంబ్రిగుడలో 8.2, జి. మాడుగులలో 8.4, అరకులోయలో 8.5, పాడేరులో 10.9, ముంచంగిపుట్టులో 10.9, చింతపల్లిలో 11.3, గూడెంకొత్తవీధిలో 11.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఇక తెలంగాణలో కూడా చలి తీవ్రత భారీగా పెరిగింది. హైదరాబాద్ సహా అన్ని జిల్లాల్లో చలి తీవ్రత పెరిగింది. హైదరాబాద్ తోపాటు నగర శివార్లలో ఉష్ణోగ్రతలు 12 డిగ్రీలకు పడిపోయాయి. చలి తీవ్రతతో నగర వాసులు వణుకుతున్నారు. ఉదయం స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 10 అయినా జనాలకు బయటకు రాలేపోతున్నారు. తెలంగాణలోని ఏజెన్సీ మండలాల్లో చలి పెరిగింది. గ్రామాల్లో తెల్లవారుజామున కురుస్తున్న మంచుతో బయటకు వెళ్లేందుకు జనాలు భయపడుతున్నారు.

# ‘గేమ్ ఛేంజర్’ చూస్తుంటే దిమ్మ తిరిగి బొమ్మ కనబడింది

## : ఎస్‌జే సూర్య



రామ్‌చరణ్, శంకర్ కాంబినేషన్‌లో ‘దిల్’రాజు నిర్మిస్తున్న భారీ చిత్రం ‘గేమ్ ఛేంజర్’. కియారా అద్వానీ నాయికగా నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులతో పాటు చిత్రీకరణ కూడా జరుపుకుంటోంది. జనవరి 10న రానున్న సంక్రాంతికి చిత్రం విడుదల కాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రెండు యూనిట్‌లతో శరవేగంగా జరుపుతున్నారు. ఈ చిత్రంలో నటుడు ఎస్‌జే సూర్య ప్రతినాయకుడిగా కనిపించబోతున్నాడు. కాగా గురువారం నాటికి తన డబ్బింగ్‌ను పూర్తిచేసుకున్న ఎస్‌జే సూర్య ‘గేమ్ ఛేంజర్’ చిత్రంపై తన ‘ఎక్స్ ‘ ఖాతా వేదికగా తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు.‘‘రామ్‌చరణ్, శ్రీకాంత్ కాంబినేషన్‌లో నేను చేసిన రెండు సన్నివేశాలకు డబ్బింగ్ చెప్పడానికి మూడు రోజులు పూర్తిగా కేటాయించాను. ఇప్పుడు అవుట్‌పుట్ చూస్తుంటే దీనమ్మ దిమ్మ తిరిగి బొమ్మ కనబడింది. ఈ సన్నివేశాలకు థియేటర్‌లో పిచ్చి పిచ్చిగా అప్లాజ్ వస్తుంది. పోతారు మొత్తం పోతారు థియేటర్‌కి పోతారు... నాకు ఇలాంటి గొప్ప చిత్రంలో నటించే అవకాశం ఇచ్చినందుకు దర్శకుడు శంకర్‌కు, దిల్ రాజుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ‘దిల్’ రాజు గారికి ఇది ర్యాంపింగ్ సంక్రాంతిగా నిలుస్తుంది” అంటూ ‘గేమ్ ఛేంజర్’ చిత్రంను ఉద్దేశించి నటుడు ఎస్‌జే సూర్య ట్వీట్ చేశాడు. ఇది చూసిన మెగా అభిమానులు పండగ చేసుకుంటున్నారు. ‘గేమ్ ఛేంజర్’ చిత్రం విజయంపై ఈ ట్వీట్‌తో వారికి మరింత నమ్మకం పెరిగిందంటున్నారు. ఇటీవల లక్నోలో టీజర్‌ను విడుదల చేసిన ‘గేమ్ ఛేంజర్’ బృందం త్వరలోనే ప్రచార కార్యక్రమాలు వేగవంతం చేయనున్నారు. దీనికి సంబంధించిన అప్‌డేట్‌లు కూడా త్వరలో తెలియజేస్తారని సమాచారం.

# యాడ్ కోసం కొత్త లుక్‌లో మహేశ్

టాలీవుడ్ స్టార్ హీరో మహేశ్ బాబు త్వరలోనే అభిమానులకు ఎస్ఎస్ఎంబీ 29 రూపంలో బ్యాక్ టు బ్యాక్ అప్‌డేట్స్ అందించేందుకు రెడీ అవుతున్నాడని తెలిసిందే. ఇప్పటికే ఎస్ఎస్ రాజమౌళి కాంపౌండ్ నుంచి వస్తోన్న ఈ మూవీ కోసం మేకోవర్ మార్చుకున్నాడు. సూపర్ స్టార్ నుంచి కొత్త అప్‌డేట్ ఏమైనా వస్తుందా.. అని ఎదురుచూస్తున్న అభిమానుల్లో కొత్త స్టిల్ జోష్ నింపుతోంది. మహేశ్ బాబు తాజాగా షూటింగ్‌లో పాల్గొన్నాడు. ఇంతకీ ఈ షూట్ సినిమా కోసమంటున్నారా.. కాదు.. యాడ్ కోసం ఇలా ఫ్రెష్ లుక్‌లోకి మారిపోయాడు. టీ షర్ట్ అండ్ జీన్స్ కాంబోలో స్టైలిష్ లాంగ్ కర్లీ హెయిర్‌తో యాడ్ షూట్ మెంబర్‌తో చిరునవ్వులు చిందిస్తున్న లుక్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మహేశ్ బాబు చేసే యాడ్స్‌కు సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. మరి ఈ సారి ఏ వాణిజ్య ప్రకటనలో కనిపించబోతున్నాడనేది ప్రస్తుతానికి సస్పెన్స్‌గా మారింది. మహేశ్ బాబు తాజా ఫొటో చూసిన అభిమానులు ఫుల్ ఖుషీ అయిపోతున్నారు. ఎస్ఎస్ఎంబీ 29 ప్రారంభంలో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఈ గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్ రూ.1000 కోట్లకుపైగా బ్జడెట్‌తో తెరకెక్కనుండగా.. హాలీవుడ్ యాక్టర్లు, సాంకేతిక నిపుణులు ఈ సినిమాలో భాగం కాబోతున్నారని సమాచారం. యాక్షన్ డ్రామా నేపథ్యంలో ఆఫ్రికన్ అడ్వెంచరస్ రైడ్‌గా వస్తోన్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 మొదటి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఇన్ సైడ్ టాక్.



# తండేల్ ‘బుజ్జితల్లి’ హార్ట్ టచింగ్ ట్యూన్స్ తో దేవి మ్యాజిక్

టాలీవుడ్ టాలెంటెడ్ యువ హీరో నాగచైతన్య, స్టార్ హీరోయిన్ సాయి పల్లవి జంటగా నటిస్తున్న సినిమా తండేల్. టాలీవుడ్ టాలెంటెడ్ యువ హీరో నాగచైతన్య, స్టార్ హీరోయిన్ సాయి పల్లవి జంటగా నటిస్తున్న సినిమా తండేల్. ఈ సినిమాపై అంచనాలు ఏ స్థాయిలో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక సినిమాకి సంబంధించిన అప్డేట్స్ తో మరింత హైప్ క్రియేట్ అవుతోంది. ఫైనల్ గా సినిమా నుంచి మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. మొదటి సింగిల్ “బుజ్జితల్లి” లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. చందూ మొండేటి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా ప్రేమ, యాక్షన్ నేపథ్యంలో సాగుతుండగా, బుజ్జితల్లి పాట ప్రేమ జంట మధ్య భావోద్వేగాలను హైలెట్ చేస్తోంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ స్వరపరిచిన ఈ పాట అందమైన మెలోడీతో శ్రోతలను ఆకట్టుకుంటోంది. ‘సముద్రం సాక్షిగా ఒక యథార్థ ప్రేమకథ’ అంటూ లిరికల్ సాంగ్ మొదలైన విధానం బాగుంది. దేవిశ్రీ ప్రసాద్ ఎమోషనల్ ట్యూన్స్ తో కంపోజ్ చేసి, ఈ పాటను అందించారు. శ్రీవాణి రాసిన సాహిత్యం ప్రేమికుల మధ్య ఉన్న అనుబంధాన్ని అక్షర రూపంలో వెలుగులోకి తీసుకొచ్చింది. జావేద్ అలీ పాడిన ఈ పాట హార్ట్ ను టచ్ చేసే విధంగా ఉంది. అతని గాత్రం పాటకు మరింత ప్రేమను జోడించింది. బుజ్జితల్లి పాట కథలో కీలకమైన సందర్భంలో వస్తుందని మేకర్స్ తెలిపారు. కథానాయకుడు తన




ప్రేయసిని ఓదార్చే క్రమంలో ఈ పాట తెరపై కనిపిస్తుంది. ఈ పాట ద్వారా వారి మధ్య ఉన్న ప్రేమను అద్భుతంగా ప్రతిబింబించారు. లిరికల్ వీడియోలో చూపించిన లొకేషన్లు, విజువల్స్ చూడగానే ఆకట్టుకుంటాయి. నాగచైతన్య, సాయి పల్లవి జంట తెరపై క్యూట్ గా హైలెట్ అయ్యారు. ఈ జంట తమ కెమిస్ట్రీతో ప్రేక్షకులను ముగ్ధులను చేస్తుంది. పాట మాత్రం ఈ ఏడాది సూపర్ హిట్ ప్రేమగీతంగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ నిర్మిస్తుండగా, అల్లు అరవింద్ ప్రొడక్షన్‌ను సమర్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా డి మచిలేశం గ్రామంలో జరిగిన నిజ జీవన ఘటనల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది.ప్రేమ కథతో పాటు దేశానికి సంబంధించిన ఎమోషన్స్ యాక్షన్ ఎలిమెంట్స్ కలగలిపి ఒక ప్రత్యేకమైన సినిమాగా తండేల్ ఆకట్టుకోనుంది. సినిమాటోగ్రఫీని షామ్‌దత్ హ్యాండిల్ చేస్తుండగా, జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఆర్ట్ విభాగానికి శ్రీనగేంద్ర తంగాలా నేతృత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఫిబ్రవరి 7న విడుదల కాబోతుండగా, బుజ్జితల్లి పాట ద్వారా తండేల్ టీం ప్రమోషన్స్‌కు బలమైన ప్రారంభం ఇచ్చింది. థండేల్ కేవలం మంచి కథతోనే కాకుండా, మ్యూజికల్ హిట్‌గా కూడా నిలిచే అవకాశం ఉందని చెప్పొచ్చు.

# అందాల శృతి మళ్లీ బ్లాక్‌లో మెరిసింది



కమల్ హాసన్ నట వారసురాలు శృతి హాసన్ హీరోయిన్‌గా వరుస సినిమాలు చేస్తూ దూసుకు పోతుంది. ఆ భాష ఈ భాష అనే బేధం లేకుండా, అక్కడ ఇక్కడ అనే భావన లేకుండా ఎక్కవ ఆఫర్లు వస్తే అక్కడ సినిమాలు చేసేందుకు శృతి హాసన్ రెడీగా ఉంటారు. నటిగా తనను తాను సంతృప్తి పరచుకునేందుకు చాలా కష్టపడే శృతి హాసన్ సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా షేర్ చేసే అందాల ఆరబోత ఫోటోలు ఆమె ఫాలోవర్స్‌కి కన్నుల విందుగా నిలుస్తూ ఉంటాయి. తన ఫోటోలతో నెట్టింట ఎప్పుడూ అందరినీ పలకరిస్తూ ఉండే శృతి హాసన్ ఈసారి బ్లాక్ చీర కట్టుతో ఆకట్టుకుంది. హార్ట్ టచింగ్ ట్యూన్స్ తో దేవి మ్యాజిక్ శృతి హాసన్ ఎక్కువగా బ్లాక్ డ్రెస్‌లో కనిపించింది. ఆమె ప్రతిసారి తన బ్లాక్ డ్రెస్ ఫోటోలను షేర్ చేసినప్పుడూ వైరల్ కావడం మనం చూస్తూ ఉంటాం. తన ఫేవరేట్ కలర్స్‌లో ఒకటి అయిన బ్లాక్ లో శృతి హాసన్ కనిపించిన ప్రతిసారి ఆమె ఫ్యాన్స్ సైతం కళ్లు పెద్దవి చేసుకుని చూస్తూ ఉంటారు. నెట్టింట మరోసారి అందాల శృతి హాసన్ బ్లాక్ చీర కట్టుతో మెప్పించింది. బ్లాక్ తో తన అందం మరింత పెరుగుతుంది అనేట్లుగా ఈ ఫోటోలు ఉన్నాయి అనడంలో సందేహం లేదు. భలే అందం, భలే ఫిజిక్ అంటూ శృతి హాసన్‌పై నెటిజన్స్ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. బ్లాక్ చీర కట్టులో ఈ ఫోటోలను షేర్ చేసిన శృతి హాసన్... పశ్చాత్తాపం లేదు, నా అవార్డును అందుకోవడానికి ఎప్పుడూ చిన్న డ్రెస్ వేసుకున్నాను, అవళ్వికటం గౌరవానికి ధన్యవాదాలు. బలమైన, ప్రతిష్టాత్మకమైన ప్రత్యేకమైన మహిళలతో కలిసి ఉండటం చాలా స్ఫూర్తిదాయకంగా ఉందని పోస్ట్ పెట్టింది. శృతి హాసన్ తాజాగా ఒక అవార్డ్ వేడుకలో పాల్గొన్న సందర్భంగా ఈ బ్లాక్ చీర కట్టులో కనిపించింది. తనకు అవార్డ్‌ను ఇచ్చిన సంస్థకు ధన్యవాదాలు తెలుపుతూ ఈ ఫోటోలు షేర్ చేయడం జరిగింది. శృతి హాసన్ చీర కట్టు ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. శృతి హాసన్ సినిమాల విషయానికి వస్తే... అడవి శేష్‌తో కలిసి డెకాయిట్ సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాకు సంబంధించిన అప్డేట్ కోసం ప్రేక్షకులు చాలా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. కొన్ని కారణాల వల్ల అప్‌డేట్ చాలా ఆలస్యం అయింది. త్వరలోనే అప్‌డేట్ వస్తుందని శృతిహాసన్ అభిమానులు నమ్మకంగా ఉన్నారు. మరో వైపు సలార్ 2 లోనూ శృతి హాసన్ ఉండే అవకాశాలు ఉన్నాయి. ఈ రెండు కాకుండా తెలుగులో మరో రెండు సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయి. హిందీ సినిమాల్లోనూ ఈమె నటిస్తోంది. మొత్తానికి ఈమె తెలుగులోనే కాకుండా హిందీ, తమిళ భాషల్లోనూ సినిమాలు, సిరీస్‌ల్లో నటిస్తూ బిజీ బిజీగా ఉంది.




# టీజర్: ట్రాజెడి జాతకంలో సారంగపాణి

టాలెంటెడ్ నటుడు ప్రియదర్శి హీరోగా డిఫరెంట్ కంటెంట్ ఉన్న కథలను సెలెక్ట్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఇక మంచి కంటెను ఉన్న దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ దర్శకత్వంలో ప్రియదర్శి మరో వినూత్నమైన సినిమాతో రాబోతున్నాడు. వీరి కలయికలో తెరకెక్కిన సరికొత్త చిత్రం ‘సారంగపాణి జాతకం’. రూప కొడవయూర్ ఈ చిత్రంలో ప్రియదర్శికి జోడీగా నటించింది. ఇదిలా ఉంటే తాజాగా ఈ మూవీ టీజర్ ని ప్రేక్షకుల ముందుకి తీసుకొచ్చారు. చిన్నప్పటి నుంచి చేతిలో రేఖలు, జీవితంలో జాతకాలు ప్రభావం ఉంటాయని నమ్మే వ్యక్తిబ ప్రియదర్శి ఈ చిత్రంలో కనిపిస్తున్నాడు. అతను చేసే ప్రతి పని, తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక కచ్చితంగా జాతకం ఉంటుంది. గుడ్డిగా రాశిఫలాలు, జ్యోతీష్యం నమ్మి నిర్ణయాలు తీసుకునే వాడి లైఫ్ లో జాతకం తలక్రిందులైతే ఎలా ఉంటుందనే ఇంటరెస్టింగ్ పాయింట్ తో ఈ మూవీ కథని దర్శకుడు ఇంద్రగంటి చెప్పబోతున్నట్లు టీజర్ బట్టి తెలుస్తోంది. ప్రస్తుత కాలంలో ఫ్యామిలీ మొత్తం చూడదగ్గ నేచురల్ హాస్యంతో కథలు చెప్పే దర్శకులలో ఇంద్రగంటి మోహనకృష్ణ పేరు కచ్చితంగా ఉంటుంది. ‘అష్టాచెమ్మా’, ‘అమీతుమీ’ లాంటి సినిమాలతో అతను వినోదాన్ని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. మరోసారి ‘సారంగపాణి జాతకం’లో కూడా జ్యోతీష్యం నమ్మకాల నేపథ్యంలో కామెడీని జెనరేట్ చేస్తూ కథని చెప్పబోతున్నాడు. జాతకాల ట్రాజెడిలో హీరో అల్లరి ఎట్రాక్ట్ చేస్తోంది. ఇందులో అవసరాల శ్రీనివాస్ ఓ ఇంటరెస్టింగ్ పాత్రలో కనిపించాడు. ఫుల్ ఫ్యామిలీ కామెడీ ఎంటర్టైనర్ గా ఈ సినిమా ఉండబోతోందని టీజర్ తో స్పష్టం అయ్యింది. ప్రియదర్శి కూడా తన పాత్రలో ఒదిగిపోయాడు. వెన్నెల కిషోర్ ఫుల్ కామెడీ జెనరేట్ చేసే క్యారెక్టర్ చేశాడు. కచ్చితంగా ఈ సినిమా కావాల్సినంత వినోదం అందించడం గ్యారెంటీ అనే మాట వినిపిస్తోంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613